ప్రజాశక్తి

సోమవారం 11 డిసెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఒళ్లు జలదరించేలా..

◆ ఆకట్టుకున్న నేవీ విన్యాసాలు ◆ విశాఖ తీరం.. జన సందోహం



సముద్రంలో బాంబు బ్లాస్టింగ్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తీరంలో ఆదివారం యుద్ధ వాతావరణం అలుముకుంది. ఎక్కడ చూసినా ఫిరంగుల మోత, విమానాల భీకర గర్జనలు. శత్రు మూకలపై ఉవ్వెత్తున తిరగబడే నావికుల ధీరత్వం.. ఇవే కానవచ్చాయి. వెరసి ఆర్‌కె బీచ్‌లోని నేవీ విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. నావికుల ప్రదర్శనలు ఒళ్లు జలదరింపజేశాయి. తూర్పు నౌకాదళం శక్తి సామర్థ్యాలకు ఈ విన్యాసాలు మచ్చుతునకగా నిలిచాయి. ప్రతి ఏటా డిసెంబర్ 4న నేవీ డే సందర్భంగా నిర్వహించాల్సిన ఈ విన్యాసాలకు ఈసారి మిచౌంగ్ తుపాను ఆటంకంగా మారడంతో 10వ తేదీకి వాయిదా వేశారు. ఈ క్రమంలో ఆదివారం తలపెట్టిన విన్యాసాలను తిలకించేందుకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నేవీ అసాధారణ సామర్థ్యాలను కనులారా వీక్షించారు. ఇండియన్ నేవీ యుద్ధ నౌకలు ఐఎన్‌ఎస్ కుతర్, ఐఎన్‌ఎస్ కింజర్, ఐఎన్‌ఎస్ కిల్తాన్, ఐఎన్‌ఎస్ రణ విజయ్, ఐఎన్‌ఎస్ శివాలిక్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐఎన్‌ఎస్ జలస్వకు చెందిన ఉభయచర నౌకలు మూడు వరుసలుగా వచ్చి ప్రదర్శనలో ముచ్చటగొలిపాయి. 8000 అడుగుల ఎత్తు నుంచి ఐదుగురు మెరైన్ నేవీ కమోండోలు ప్యారాషూట్ ద్వారా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తూ కిందకు దిగడం పలువురిని మిగతా 2లో..



శత్రుమూకలపై కాల్పులు జరుపుతున్న నావికులు

'ఉక్కు'పై నాటకాలెందుకు ?

◆ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని పవన్ చెప్పడం 'ఆపద మొక్కుల కోసమే..'

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగిందంటూ విశాఖలో పవన్ కల్యాణ్ జనసేన సభలో మాట్లాడడం 'ఆపద మొక్కుల కోసమే' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం విశాఖలో సిపిఎం విశాఖ జిల్లా ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా జగదాంబ దరి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బిజెపి వద్ద ఆపదమొక్కుల కోసమే జనసేన అధినేత ఆ మాటలు మాట్లాడారని తెలిపారు. ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగడం ప్రజా, కార్మిక పోరాటాల ఘనత అని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆ ఘనతను అమిత్ షాకు ఇవ్వాలని పవన్ కల్యాణ్ తహతహలాడడం చూస్తే కార్మికులు, ప్రజలు వెయ్యి రోజులకు పైగా నిర్వహిస్తున్న ఉద్యమాన్ని, పోరాట స్ఫూర్తిని పవన్ అగౌరవ పరచడమేనని అన్నారు. ఒకవేళ ఇదే నిజమైతే ప్రస్తుతం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్నాయని అమిత్ షా లేదా మోడీ, స్టీల్ మంత్రితో ఈ విషయంపై ప్రకటనను పవన్ చేయించగలరా ? అని అడిగారు. ఒకవేళ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగి ఉంటే స్టీల్‌ప్లాంట్‌లో నిలిపేసిన బ్లాస్ట్ ఫర్నేస్‌ను తెరిపించేవారని, సొంత గనులు, ఐరన్ ఓర్ ఇప్పించేవారని, రుణం కూడా ఇప్పించి కేంద్రం ఆదుకుని ఉండేదని తెలిపారు. ఈ మూడు జరగకుండా ప్రైవేటీకరణ ఆగిందంటే 'మూసేసే ప్రక్రియ మొదలైందా?' అని అడిగారు. ఎపికి ద్రోహం తలపెట్టాలని చూసే బిజెపితో అంటకాగుతూ వారి మాటలే వల్లెవేయడం పవన్‌కు సరైంది కాదని శ్రీనివాసరావు హితవు పలికారు.

వైజాగ్.. వరల్డ్ గ్రోత్ హబ్ ఎలా సాధ్యం ?

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ బిజెపి ఎంపీ జివిఎల్ నరసింహారావు విశాఖను ప్రపంచ గ్రోత్ హబ్‌గా మార్చే ప్రక్రియను కేంద్రం తీసుకుందని, ముంబయి తరహాలో కొద్ది సంవత్సరాల్లో నగరాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని బుకాయించడం అర్థం లేని మాట అని తెలిపారు. విశాఖలో ప్రభుత్వ రంగ సంస్థలను బతకనిచ్చే ప్రణాళిక బిజెపి వద్ద ఉందా ? అని ప్రశ్నించారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి వరకూ నీతి అయోగ్ స్టీరింగ్ కమిటీ వేశామని జివిఎల్ చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. విభజన హామీలు ఒక్కటంటే ఒక్కటైనా అమలు చేయకుండా ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ లేకుండా చేసి, వాల్తేరు డివిజన్‌ను ఎత్తేసి, స్టీల్‌ప్లాంట్‌ను ప్రమాదంలో పడేసి, ఇస్తానని చెప్పిన రైల్వే జోన్‌కు ఆటంకాలు కలుగజేస్తూ విశాఖను గ్రోత్ హబ్‌గా ఎలా మిగతా 2లో..

విశాఖ బాలోత్సవానికి వాలంటీర్లు సన్నద్ధం

▶ వార్త 2లో..

నగరంలో సినీతార అనసూయ సందడి

▶ వార్త 2లో..

వన్ వే ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

▶ వార్త 2లో..

ప్రణాళికాయుత పంటల సాగు అవసరం

ఆర్ఎఆర్ఎస్ సహ సంచాలకులు డాక్టర్ జగన్నాధరావు





ప్రజాశక్తి - అనకాపల్లి : 'మిచౌంగ్ తుపాను నేపథ్యంలో వరి పంటతో పాటు వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రణాళికయుత పంట సాగు చేపడితే మేలు జరుగుతుంది' అని ఆర్ఎఆర్ఎస్ సహ సంచాలకులు డాక్టర్ పివికె. జగన్నాధరావు అన్నారు. ఆయన ప్రజాశక్తితో కాసేపు ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వేరుశనగ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటి ?

నిద్రావస్థ కలిగిన రకాల్లో నష్టం తక్కువ ఉంటుంది. నిద్రావస్థ లేని రకాలు నీట మునిగితే గింజ మొలక వచ్చి నష్టం ఎక్కువ జరుగుతుంది. పొలంలో నిలిచి ఉన్న నీటిని తక్షణమే తొలగించాలి. పప్పు శనగలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. ఇనుము లోపాన్ని సరి చేసేందుకు, తిరిగి కోలు కోవడానికి ఫెర్రస్ సల్ఫేట్ ఐదు గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు, యూరియా 20 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

కంది, మినుము, పెసర సాగులో ఎలా ముందుకు వెళ్లాలి ?

కందిలో కాయ తొలుచు పురుగు నివారణకు వర్షం ఆగిన వారం తర్వాత క్లోరిఫైర్ఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా నోవాల్యూరాన్ ఒక మిల్లీమీటర్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మినుము, పెసరకు సంబంధించి ఫెర్రస్ సల్ఫేట్ ఐదు గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు, యూరియా 20 గ్రాములు మిగతా 2లో..

నేటి నుంచి లోకేష్ యువగళం

సాయంత్రానికి పాయకరావుపేటకు రాక



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం సాయంత్రానికి జిల్లాలో ప్రవేశించనుంది. తుని నుంచి సాయంత్రం 5.30 గంటలకు జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గంలోకి లోకేష్ రానున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున స్వాగతం పలికేందుకు కార్యకర్తలను సమీకరిస్తున్నారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత యువగళం విజయవంతానికి పార్టీ శ్రేణులను సమాయత్తపరిచారు. సోమవారం నుంచి బుధవారం ఉదయం 11.25 గంటల వరకు పాయకరావుపేట నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర కొనసాగనుంది. సోమవారం సాయంత్రం పిఎల్.పురం, సీతారామపురం, నామవరంలో పర్యటించనున్నారు. నామవరంలో రాత్రి బసచేసి, మంగళవారం ఉదయం 8 గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తారు. పలు గ్రామాల మీదుగా సాయంత్రం 7.50 గంటలకు క్రిషి గోకులం వుడా లేఅవుట్‌కు చేరుకొని అక్కడ రాత్రి బస చేయనున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు బయలుదేరి పెనుగొల్లు మీదుగా ఉదయం 11.25 గంటలకు యలమంచిలి నియోజకవర్గానికి చేరుకుంటారు. పాయకరావుపేట నియోజకవర్గంలో స్థానికులు, యువత, బిసిలు, కాపులు, మహిళలు, డ్వాక్రా, కేబుల్ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు, మత్స్యకారులు, సుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, రైతులతో మాట్లాడనున్నారు.

యలమంచిలి నుంచి అనకాపల్లి నియోజకవర్గం మీదుగా గాజువాక నియోజకవర్గంలోకి ప్రవేశించనున్నారు. గ్రామీణ ప్రాంతంలోని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధి అరకు, పాడేరు, వి.మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల పార్టీ కార్యకర్తలను సమీప పాదయాత్ర ప్రాంతాలకు తీసుకురానున్నారు. యువగళం పాదయాత్రకు మధ్యలో కొన్ని రోజులు విరామం రావడంతో గ్రామీణ ప్రాంతంలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్న నౌకలు

ఒళ్లు 'జల'దరించేలా..

సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. నేవీ స్కూల్‌కు చెందిన సి – క్యాడెట్స్ తమ డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. వేడుకల్లో తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, రాష్ట్ర మంత్రులు విడుదల రజని, గుడివాడ అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు. విన్యాసాలు చూసేందుకు విశాఖ నగర వాసులు పోటెత్తారు.

'ఉక్కు'పై నాటకాలెందుకు ?

చేస్తారని ప్రశ్నించారు. తడిగుడ్డతో గొంతును కోయడం అంటే ఇదేనన్నారు. ఐటి పరిశ్రమ అభివృద్ధి కాకుండా సిఎం క్యాంపు ఆఫీసు, మంత్రుల కార్యాలయాల కోసం రుషికొండ, ఇతర హిల్స్‌ను వినియోగించే ప్రణాళికతో ముందుకెళ్తున్నారని, మరోవైపు ప్రభుత్వ రంగానికిగల ప్రాతిపదికను తీసేస్తున్నారని, ఇక 'గ్రోత్ హబ్' ఎలా చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి లోకేష్ యువగళం

పాదయాత్ర చేపట్టడానికి సమయం సరిపోదని జాతీయ రహదారికి అనుకొనివున్న నియోజకవర్గాల గుండా పాదయాత్రకు ప్రణాళిక రచించారు. యాత్ర సాగిన ప్రతి నియోజకవర్గం సమీపంలోని గ్రామాల నుంచి కార్యకర్తలను తరలించి భారీ ఎత్తున ఎక్కడికక్కడ స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. పాదయాత్ర సాగిన ప్రాంతాల్లో భారీ ఎత్తున ఫ్లెకీలు ఏర్పాటు చేశారు. కూడళ్లలోనూ, దారిపొడవునా జెండాలు కట్టారు.

ముగింపు సభ ఏర్పాట్లపై సమీక్ష

విశాఖ కలెక్టరేట్ : నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర విశాఖపట్నం జిల్లాలో ముగుస్తున్న సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో పార్టీ జోన్ వన్ ఇన్‌ఛార్జి దామచర్ల సత్య ఆధ్వర్యంలో సమీక్ష జరిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, మాజీ కార్పొరేటర్ ఆళ్ళ శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రణాళికాయుత పంటల సాగు అవసరం

లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. వేరు కుళ్ళు తెగులు, ఆకు మచ్చ తెగులు ఆశించకుండా హెక్సకొనజల్ రెండు మిల్లీలీటర్లు లేదా ప్రొఫీ కొనజోల్ ఒక మిల్లీలిటరు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి.

చిరుధాన్యాల పరిస్థితేంటి ?

జొన్న పంట పూత గింజ ఏర్పడే దశలో ఉన్నప్పుడు బూజు తెగులు ఆశించకుండా ప్రొపి కొనజోల్ శిలీంద్ర నాశక మందును 0.5 మిల్లీలీటర్ల లీటరు నీటికి కలిపి కంకులపై పిచికారీ చేసుకోవాలి. జొన్న కోసి పొలాలపై ఉంచినప్పుడు రెండు శాతం ఉప్పు ద్రావణాన్ని లీటరు నీటికి చొప్పున కలిపి కంకులపై పిచికారీ చేసుకోవాలి.

వన్ వే ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని నివారించేందుకు రంగపర–సికింద్రాబాద్, పూరీ–అహ్మదాబాద్ మధ్య వన్ వే ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు రైలు నెంబరు 02605 రంగపర నార్త్ – సికింద్రాబాద్ వన్ వే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు డిసెంబర్ 17 ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు రంగపర నార్త్‌లో బయలుదేరుతుంది. మంగళవారం తెల్లవారుజామున 2.00 గంటలకు విశాఖపట్నం చేరుకుని 2.20 గంటలకు బయలుదేరి అదేరోజు సాయంత్రం 16.30 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది. ఈ రైలు ఉడల్‌గురి, రంగియా, బార్‌పేట రోడ్, న్యూ బొంగైగావ్, కోక్రాఝర్, న్యూ కూచ్‌బెహార్, న్యూ జల్పైగురి, కిషన్‌గంజ్, మాల్దా టౌన్, రాంపూర్‌హాట్, బర్ధమాన్, దంకుని, ఖరగ్‌పూర్, కటక్, భువనేశ్వర్, ఖుర్దాక్ రోడ్, బ్రహ్మపూర్, బ్రహ్మపట్నం, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నల్గొండ మీదుగా ప్రయాణిస్తుంది.

08419 పూరీ – అహ్మదాబాద్ వన్ వే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు డిసెంబర్ 11 సోమవారం ఉదయం 9.50 గంటలకు పూరి నుంచి బయలుదేరి సాయంత్రం 17.15 గంటలకు విశాఖపట్నం చేరుకుని మరలా 17.35 గంటలకు బయలుదేరి బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు అహ్మదాబాద్ వెళ్తుంది. ఈ ప్రత్యేక రైలు ఖుర్దా రోడ్, బాలుగావ్, ఛత్రపూర్, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, వరంగల్, రామగుండం, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఆగుతుంది. చంద్రపూర్, వార్దా, బద్నేరా, అకోలా, షెగావ్, మల్కాపూర్, భూసావల్, జల్గావ్, అమల్నేర్, దొండైచా, నదుర్బార్ మీదుగా ప్రయాణిస్తుంది.

విశాఖ బాలోత్సవానికి వాలంటీర్లు సన్నద్ధం

ప్రజాశక్తి – కలెక్టరేట్ : విశాఖ బాలోత్సవం ఈ నెల 14, 15, 16 తేదీలలో సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం పాఠశాలలో జరుగనుందని, ఇప్పటికే వాలంటీర్లు అందుకు పూర్తి సన్నద్ధతతో ఉన్నారని బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు తెలిపారు. వేలాది మంది విద్యార్థులు పాల్గొనే ఈ పిల్లల పండగ నిర్వహణ కోసం ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో వాలంటీర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ 27 ఈవెంట్స్ జరుగుతాయని, దాదాపుగా 100 మంది వాలంటీర్లు ఈ కార్యక్రమం నిర్వహణకు అవసరం ఉంటుందని అన్నారు.

యువతలో సేవాభావం పెంపొందించేందుకు ఇది చాలా మంచి అవకాశమన్నారు. ఇంటర్ పైబడిన వారు వాలంటీరుగా సేవలు అందించేందుకు రావొచ్చునని తెలిపారు. తలిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి వాలంటీర్లుగా పంపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లుగా



మాట్లాడుతున్న రాజేశ్వరరావు

రావాలనుకునే వారు 9550356471 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. బాలోత్సవం నిర్వహణ కమిటీలు ఇప్పటికే వేశామన్నారు. వాలంటీర్ల కో – ఆర్డినేటర్‌గా ఎమ్.గుణ శంకర్, సభ్యులుగా హరిత, ఉమా శైలజ, ఉషా, రోషన్, ఆర్.నిఖిల్, జాహ్నవి, అజయ్, సంధ్య, మీనాక్షి, సాయి తేజ, అలేఖ్య ఉన్నారని తెలిపారు. సమావేశంలో బాలోత్సవం అధ్యక్షులు పి.రఘు, ఉపాధ్యక్షులు కె.రమాప్రభ, ఎల్లాజీ, సరోజినీదేవి, ప్రీతి పాల్గొన్నారు.

లక్కీ షాపింగ్ మాల్‌లో..

సినీతార అనసూయ సందడి



సెల్ఫీ దిగుతూ సందడి చేస్తున్న అనసూయ

ప్రజాశక్తి – కలెక్టరేట్ : నగరంలోని జగదాంబ జంక్షన్‌లో ఉన్న లక్కీ షాపింగ్ మాల్‌లో క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఫెస్టివల్ ఆఫర్స్ ప్రకటిస్తూ.. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ తార అనసూయ పాల్గొని సందడి చేశారు. ముందుగా నగర ప్రజలకు అభివాదం చేస్తూ ఆమె కాసేపు ముచ్చటించారు. షోరూం బయట ఏర్పాటు చేసిన స్టేజీపై స్టెప్పులు వేస్తూ అదరగొట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 12 ఏళ్లుగా విశాఖ ప్రజల మన్నలు పొందుతున్న లక్కీ షాపింగ్ మాల్ పండుగ సీజన్‌లో సరికొత్త ఆఫర్స్ తీసుకువచ్చిందన్నారు. షోరూమ్ అధినేతలు రత్తయ్య, శ్రీను, స్వామి మాట్లాడుతూ తమను ఆదరిస్తున్న విశాఖ ప్రజలకు గివింగ్ బ్యాక్ ఉద్దేశంతో ఉమెన్స్ వేర్, లేడీస్ వేర్, జెంట్స్ వేర్. కిడ్స్ వేర్ ఇలా ఫ్యామిలీ వేర్ అన్ని విభాగాలలో అదిరిపోయే ఆఫర్స్‌ను అందిస్తున్నామని చెప్పారు. ఈ ఫెస్టివల్ సీజన్ కోసం షోరూమ్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అనంతరం సినీ హీరోయిన్ అనసూయ షోరూమ్ మూడంతస్తుల్లో అందుబాటులో ఉంచిన కలెక్షన్లను పరిశీలించారు. ఆకట్టుకున్న చీరలను ప్రదర్శించి ఫోజులిచ్చారు. ప్రారంభోత్సవంలో జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కంకటాల మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

టైకూన్ జంక్షన్ వద్ద నేడు జనసేన మహా ధర్నా

ప్రజాశక్తి – కలెక్టరేట్ : సిరిపురం టైకూన్ జంక్షన్ వద్ద జనసేన నేతృత్వంలో సోమవారం ఉదయం 10 గంటలకు మహాధర్నా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టైకూన్ హెరిటల్ కూడలి వద్ద వైసిపి ఎంపీ ఎంవివి.సత్యనారాయణ వెంచర్ నిర్మాణాల కోసం ఉన్న రోడ్డును మూసి వేయడం అన్యాయమన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించకోకపోవడం దారుణమన్నారు. టైకూన్ జంక్షన్‌ను ఎంపీ కోసం ఇష్టం వచ్చినట్లు మూసివేయడం అధికార దుర్వినియోగం కాదా ? అని నిలదీశారు. ఆ ప్రాంతాన్ని జనసేన నేతలు సందర్శించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే హౌస్ అరెస్టులు, అక్రమ అరెస్టులు చేశారని మండిపడ్డారు. అందుకే సోమవారం అదే స్థలంలో మహా ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో సహా ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్లు, కార్పొరేటర్లు హాజరవుతున్నారని వెల్లడించారు. అక్రమ అరెస్టులకు భయపడకుండా ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి – కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గంలో, ముఖ్యంగా 39వ వార్డు పరిధిలో ప్రభుత్వ, జివిఎంసి నిధులు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డులో జివిఎంసి నిధులు మూడు కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నాడు – నేడు పథకం కింద క్వీన్ మేరీ, ఎంవిడిఎం స్కూళ్లను కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

PUBLIC NOTICE

General public is hereby informed that my client Mr.M.Prashanthkumar, S/o.M.Satishkumar, R/o. D.No.64/61, 1st Floor, Chinnathambi Street, Kosapet, Chennai-12, is intending to purchase an flat in Sai Narayana Vihar Apartment, bearing Flat No.G-4, Door No.30-82-167/3, Tirumala Nagar, Vadlapudi (u), Kanithi Colony, Ward No.30, Block No.82, Survey No.62/6, admeasuring 33.87 sq.yards, built up area 1000 sq.ft., from its owner Mr.Gurrala Bala Venkata kiran, S/o. Late. Gurrala Parameswara Rao, R/o. Vuda Phase-7, Plot No. MIG-108, Dwarakapuri, Kurmannpalem, Gajuwaka mandal, Visakhapatnam District, along with all rights, title, interest therein. Any person, authorities, entities or anyone having any claims, interest, rights, objections whatsoever in respect of the above sale transaction over the above mentioned flat G-4 or any part thereof, they may contact me with their objections or claims if any with supplementary documents in support thereof within a period of 7(seven) days from the date of publication of this notice, otherwise my client will proceed with the sale transaction treating the said flat G-4, as free from any third party claims. Any objections or claims made thereafter shall not be binding on my client.

P.VIDYANAND PATNAIK, B.Sc., B.L.,
Advocate, D.No.12-5-81,
Baruvari Street, Anakapalli - 531001,
Ph: 9789033613/9704563053.



మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

కళ్లాల్లోనే మొలకెత్తిన ధాన్యం

ఆరినవి తెస్తేనే కొనుగోలు చేస్తామంటున్న అధికారులు
అయోమయంలో రైతులు

ప్రజాశక్తి -ఆనందపురం : మిచౌంగ్ తుపాను కారణంగా పొలాల్లోనూ, కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయాయి. దీంతో ఆ ధాన్యానికి మొలకలు వచ్చేస్తున్నాయి. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా రైతు భరోసా కేంద్రాలకు వెళ్తే ఆరిన తర్వాతనే కొనుగోలు చేస్తామని చెపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆనందపురం మండలం బోని గ్రామంలో 20 రోజుల క్రితం కోసిన వరి ధాన్యాన్ని నూర్పి కళ్లాలు, పొలాల్లో ఆరబెట్టి అమ్మడానికి సిద్ధంగా ఉన్న సమయంలో తుపాన్ కారణంగా తడిసిపోయాయి.

బోని గ్రామానికి చెందిన బోని అప్పారావు 2 ఎకరాలు, కళ్ల సురేష్ 7 ఎకరాలు, కళ్ల సంతోష్ 4 ఎకరాలు, ఎన్నింటి రామకృష్ణ 2 ఎకరాలతో పాటు అనేక మంది రైతులు వరి నూర్పుచేశారు. వీరందరి ధాన్యం తడిసి మొలకలు వచ్చాయి. కొనుగోలు చేయడానికి అధికారులు నిరాకరించారు. అష్ట కష్టాలు పడి పండించిన పంట కళ్ల ముందే పాడైపోతుంటే దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అధికారులు పరిశీలించి పంటను కొనుగోలు చేసిన ఆదుకోవాలని బోని రైతులు కోరుతున్నారు.

డాబా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వండి

లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం
అంబేద్కర్ గ్రామ అభ్యుదయ సేవా సంఘం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి విశాఖ కేంద్రకారాగారం ఎదురుగా ఉన్న రామకృష్ణాపురంలో నివాసాలుంటున్న వారికి డాబా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గ్రామాభ్యుదయ సేవా సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సంఘం సభ్యులు మాట్లాడారు. రామకృష్ణాపురం ఏర్పడి సుమారు 40 ఏళ్లు కావస్తుందన్నారు. ఇక్కడ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలే నివాస ముంటున్నారని, అందరూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. తుపాన్లు వచ్చినప్పుడల్లా ఈ ప్రాంతం ముంపునకు గురవడం, రేకులు ఎగిరిపోవడం జరుగుతుందన్నారు. స్లాబ్ ఇంటి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని స్థానిక రాజకీయ నాయకులకు, అధికారులకు మొరపెట్టుకున్నా పరిష్కారం లభించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వచ్చే శాసన సభ ఎన్నికలలోగా రేకుల ఇళ్ల స్థానంలో స్లాబ్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని, లేకుంటే ఆ ఎన్నికను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు వంకర బాబూరావు, గౌరవాధ్యక్షులు కాకర గోవిందు, వీరుబాబు, వెంకటేశ్వరరావు, గెడ్డం నాయుడు, లింగాల వెంకటశ్రీధర్, సోమకాంత్ రంజిత్, చిన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

జూ పార్కుకు కొత్త నేస్తాలు రాక

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలకు కొత్తగా మరో రెండు జంతువులు వచ్చాయి. వరంగల్ కాకతీయ జంతు ప్రదర్శనశాల నుంచి జంతు మార్పిడి విధానంలో విశాఖ జూ పార్కుకు మౌస్ డీర్, చౌసింగా (నాలుగు కొమ్ముల జింక)లను ఆదివారం ఉదయం తీసుకొచ్చారు. వాటికి బదులుగా విశాఖ జూ పార్కు నుంచి వరంగల్ జూ పార్కుకి హాగ్ డీర్, బార్కింగ్ డీర్, లుటినో పారాకీట్‌లను తీసుకెళ్లారు. విశాఖకు వచ్చిన మౌస్ డీర్ ఆసియా ఖండంలోని అతిచిన్న జింక జాతికి చెందినది. నాలుగు కొమ్ముల జింక (చౌసింగ్) కూడా సందర్శకులను ఆకర్షించనున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. కొత్తగా వచ్చిన ఈ రెండు జంతువులను క్వారంటైన్‌లో ఉంచి, వ్యవధి ముగిసిన అనంతరం సందర్శకుల కోసం ఎన్‌క్లోజర్‌లో విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం 25 మొక్కలు నాటారు. సర్పంచ్ సిరిగిడి సంతోషి, ఎంపిటిసి ఉండభట్ల ఆదిలక్ష్మి, స్థానిక సోషల్ వర్కర్ మద్దిల గురునాయుడు ఆర్థిక సాయంతో ఈ మొక్కలు సమకూర్చి నాటారు. ఈ కార్యక్రమంలో సిరిగిడి ఈశ్వరరావు, యు.వెంకటఅప్పారావు, చిన్నారావు, ఉప సర్పంచ్ కె.శ్రీను, మాజీ ఎంపిటిసి ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

3500 మందికి అన్నదానం

ప్రజాశక్తి- ఆనందపురం : పెద్దిపాలెం సమీపంలో మహాగణపతి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, కృష్ణశాలతో నూతనంగా నిర్మించిన విశ్వేశ్వర స్వామికి ఆదివారం మహా అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం 3500 మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆయల సోమయాజులు, నరేష్ శర్మ దంపతులు, నాయకులు కురాకుల వెంకటేష్, ప్రముఖ న్యాయవాది చిన్నయ పాత్రుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమంచి జయంతి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి జయంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఏయు పరిపాలనా భవనం వద్దనున్న కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి ఇంచార్జి ఉపకులపతి ఆచార్య కె. సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ ఆదివారం పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏయు ఆచార్యులు, అధికారులు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రసాదరావుకు సన్మానం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, తాటితూరు జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయులు, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు టిఎస్‌వి ప్రసాదరావును ఆదివారం విశాఖ నగరంలోని అల్లూరి సీతారామ రాజు పార్కులో ఘనంగా సన్మానించారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యాన సీతారామరాజు నగర్‌లోని యోగా కేంద్రంలో తొమ్మిదో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, మానసిక ప్రశాంతతకు యోగా దోహదపడుతుందన్నారు. యోగా ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి 91వ వార్డు కార్పొరేటర్ బి.రమణ, సీతారామరాజు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరాజు, ఎన్‌వైఎస్ అధ్యక్షులు టి.సాయి, నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు. మహిళకు యోగా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

బ్రతికే ఉన్నా చంపేశారు..

రామకృష్ణ ఆవేదన



మరణించినట్లు సర్టిఫికెట్ చూపిస్తున్న రామకృష్ణ

ప్రజాశక్తి -ఆనందపురం : తాను బ్రతికే ఉన్నా రేషన్ కార్డులో చంపేశారని ఆనందపురం మండలం వేములవలసకు చెందిన కంటిమహంతి రామకృష్ణ (42) ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. తాను బ్రతికే ఉన్నానని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సరిదిద్దడం లేదని ఆవేదన చెందుతున్నారు. పేద కుటుంబానికి చెందిన కంటిమహంతి రామకృష్ణ, భార్య విజయలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు సాయిదివ్య, భవ్యశ్రీతో కలిసి వేములవలసలో జీవనం సాగిస్తున్నారు. 2018 వరకు రేషన్ ఇచ్చేవారని రామకృష్ణ తెలిపారు. తర్వాత రామకృష్ణ తండ్రి మృతిచెందారు. తండ్రి మృతికి బదులు రామకృష్ణే చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో ఉండటంతో రేషన్ కార్డులో పేరు పోయిందని అధికారులు చెబుతున్నారని వివరించారు. తాను నిరుపేద కుటుంబానికి చెందిన వాడినని, తన కుటుంబంతోపాటు సోదరి, తమ్ముడు కూడా తనపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. చనిపోయానంటూ ఆరోగ్యశ్రీ కూడా లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బ్రతికున్న తనకు డెత్ సర్టిఫికెట్ ఇచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా పరిశీలన జరిపి తాను బ్రతికున్నట్లు సర్టిఫికెట్ మంజూరు చేసి, ఆరోగ్యశ్రీ కార్డుతో పాటు కుటుంబ పోషణకు రేషన్ కార్డులో కూడా పేరు చేర్పించాలని కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

లారీ కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి జాతీయరహదారి పాతడైరీఫారం వద్ద శనివారం అర్ధరాత్రి లారీ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రం రాయఘడ జిల్లా, తికరాపాడ గ్రామానికి చెందిన ఈశ్వర గమాంగో (53) గత కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నెల 8న ఆసుపత్రిలో చూపించేందుకు ఈశ్వర్ గమాంగోను బంధువు సహదేవ్ సాబర్ విశాఖకు తీసుకొచ్చారు. సహదేవ్ సాబర్ మందులు నిమిత్తం షాపునకు వెళ్లారు. ఆ సమయంలో మానసిక వ్యాధితో బాధపడుతున్న ఈశ్వర్ గమాంగో బయటకు వచ్చేసాడు. ఎక్కడా కనిపించక పోవడంతో త్రీటౌన్ పోలీసులకు సహదేవ్ సాబర్ ఫిర్యాదు చేశారు. శనివారం అర్ధరాత్రి జాతీయరహదారి పాతడైరీఫారం వద్ద లారీ కిందపడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కనిపించలేదని ఫిర్యాదు నమోదైన వ్యక్తి ఒక్కరేనని తేలింది. ఆరిలోవ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పందూరు గ్రామానికి చెందిన సేనాపతి సత్తిబాబు (65) రామచంద్రపురం శివారు అల్లుమయ్యపాలెం గ్రామంలో ఓ రైతు తోటలో చెట్లును నరుకుతున్నాడు. ప్రమాదవశాత్తు చెట్టు సత్తిబాబు పై పడటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు స్థానిక ఎస్సై నారాయణరావు తెలిపారు.

గోస్తనీ నదిలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి కొర్రపల్లి గ్రామ సమీపంలో ఉన్న దివాన్‌జీ కాలువ వద్ద ఆదివారం గోస్తనీ నదిలో పడి పొన్నగంటి హరిబాబు (రవి) గల్లంతయ్యాడు.

పి.ఎం.పాలెం కారుషెడ్ సమీపంలోని గాయత్రీ కాలనీకి చెందిన 8 మంది అమ్మాయిలు, ఐదుగురు అబ్బాయిలు కలిసి ఆదివారం పిక్నిక్ కోసం పద్మనాభం మండలంలోని కొర్రపల్లి గ్రామానికి చేరుకున్నారు. గల్లంతైన హరిబాబు సూచన మేరకు వాటర్‌ఫాల్స్‌ను చూసేందుకు అందరూ దివాన్‌జీ కాలువ వద్దకు ఆటోపై ఉదయం 10 గంటలకు చేరుకున్నారు. సుమారు గంటపాటు వాటర్ ఫాల్స్ సమీపంలో ఉన్న ప్లాట్‌ఫారం వద్ద కూర్చున్నారు. పక్కనే చిన్నపాటిగా వచ్చిన నీటిలో మహిళలు స్నానాలు చేసి సేదతీరారు. తర్వాత ముగ్గురు అబ్బాయిలు వాటర్ ఫాల్స్ లోపలకు వెళ్లారు. ముందుగా వెళ్తున్న హరిబాబు కాలు జారి పడిపోయాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గోస్తనీ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పడిన వెంటనే హరిబాబు నీటిలో మునిగిపోయి కనిపించలేదు. వెనుక ఉన్న ఇద్దరు స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో కొర్రపల్లి గ్రామానికి చెందిన సుమారు 8 మంది యువకులు నీటిలో దిగి గాలింపు చేశారు. వర్షపు నీరు కొత్తది కావడంతో ఎర్రగా ఉండడంతో విద్యార్థి ఆచూకీ కానరాలేదు. విషయం తెలుసుకున్న పద్మనాభం సిఐ ఎం.సన్యాసినాయుడు, ఎస్ఐ జె.సురేష్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

హరిబాబు విశాఖపట్నం కృష్ణ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. విద్యార్థి తండ్రి అప్పారావు ఒక ప్రయివేట్ కాలేజీలో వంట మనిషిగా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు మగ పిల్లలు. అందులో చిన్నవాడు హరిబాబు. పెద్ద కుమారుడు ఉదయ్. గోస్తనీ నదిలో దివాన్‌జీ కాలువను ఎత్తుగా కట్టడంతో నది నుంచి వచ్చిన నీరు ఎత్తయిన కట్టడంపైనుంచి రావడంతో ఎంతో ముచ్చటగా కనిపిస్తోంది. దీనికి ఆకర్షితులై విశాఖకు సమీపంలో ఉండటంతో సెలవులు, పండగల సమయాల్లో పిల్లలు ఉత్సాహంగా వస్తున్నారు. సరదా కోసం వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రెండుమూడేళ్లలో ఇది 5వ ప్రమాదమని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాల కారణంగా గ్రామస్తులే ఈ వాటర్ ఫాల్స్ వైపు వెళ్లరని, వచ్చిన వారికి వివరించి చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

రైతు సమస్యలపై వినతి

ప్రజాశక్తి- ఆనందపురం : గ్రామీణ ప్రాంతాలలో రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు విశాఖ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులు పివివి.ప్రసాదరావు పట్నాయక్ వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు తదితరాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, వాటిని నగరాలకు తీసుకెళ్లేందుకు రైల్లలో ఉచిత ప్రయాణ అవకాశం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

గంగవరం పోర్టు వాహనాలను దారి మళ్లించాలి

జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు భారీ వాహనాలను దారి మళ్లించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె.పరశురాం, జిల్లా కన్వీనర్ లక్ష్మణస్వామి, గాజువాక జోన్ నాయకులు ఎల్.కృష్ణారావు, త్రినాధస్వామి, సింహాచలం డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ భారీ వాహనాలు 100 అడుగుల రోడ్డులో ప్రయాణం చేయడం వల్ల ఈ వారంలోనే రెండు ప్రమాదాలు జరిగాయని తెలిపారు. గురువారం సైకిల్‌పై వెళ్తున్న భాస్కరరావును భారీ వాహనం ఢీ కొట్టగా ఆయన మృతిచెందారని తెలిపారు. 50 సంవత్సరాల మరో వ్యక్తి కాళ్ల మీదుగా భారీ వాహనం వెళ్లడం వల్ల క్షతగాత్రులై ఆసుపత్రిలో ఉన్నారని తెలిపారు. అక్టోబర్ నెలలో 76వ వార్డు గోపాల్‌రెడ్డినగర్‌కు చెందిన 25 ఏళ్ల గృహిణిని కూడా గంగవరం పోర్టు భారీ వాహనం ఢీ కొట్టగా చనిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, తహశీల్దార్, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు ఇతర ప్రజాప్రతినిధులు స్పందించి గంగవరం పోర్టు నుంచి జగ్గు జంక్షన్ మీదుగా వస్తున్న భారీ వాహనాలను దారి మళ్లించాలని కోరారు.



చిన్నారులకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ తిరుపతి

సన్‌రైజ్‌లో 150 మంది పిల్లలకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలోని సన్‌రైజ్ చిల్డ్రన్ హాస్పిటల్‌తో పాటు, కరాస, సుజాతనగర్, పరవాడ బ్రాంచిల్లో హాస్పిటల్ తొమిదో వార్షికోత్సవాన్ని పరిష్కరించుకుని ఈ నెల 9 10 తేదీల్లో ఉచిత వైద్యం అందించారు. రెండు రోజులపాటు చిన్న పిల్లలకు ఉచిత రక్త పరీక్షలతో పాటు, అవసరమైన వైద్యం చేశారు. మొత్తం 150 మంది పిల్లలకు ఉచిత వైద్యం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ టి.తిరుపతి మాట్లాడుతూ, గడిచిన ఎనిమిదేళ్లలో గాజువాకతోపాటు జిల్లా నలుమూలల బ్రాంచీలను విస్తరించినట్లు తెలిపారు. పిల్లలకు మెరుగైన వైద్యం అందించడమే తమ ఆసుపత్రి లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్లు, సురేష్, నవీన్ ప్రతిభ పాల్గొన్నారు.

భక్తులతో కిటికిటలాడిన సింహగిరి

ప్రజాశక్తి-సింహాచలం: కార్తీకమాసం పిక్నిక్ సీజన్, ఆదివారం సెలవు దినం కావడంతో సింహాచల పరిసర ప్రాంతాలతో పాటు సింహగిరి భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ సిబ్బంది అంతరాలయ దర్శనం నిలిపివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కావడంతో అంతరాలయ దర్శనం లేకపోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

వైభవంగా స్వాతి నక్షత్ర హోమం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్ర హోమాన్ని అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం హోమాన్ని ఆర్చక స్వాములు నిర్వహించారు. ఈ హోమంలో ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సుభాష్ రామ్‌నాథ్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి-ఉక్కునగరం : జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు సుభాష్ రామ్‌నాథ్‌కు విశాఖపట్నం విమానాశ్రయంలో స్టీల్‌ప్లాంట్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన నగరానికి వచ్చారని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు తెలిపారు విశాఖపట్నంలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో ఎన్‌టిపిసి పవర్ గ్రిడ్ ఎస్సీ, ఎస్టీ సంఘాలు, యాజమాన్యాలతో ఎస్సీలకు సంబంధించిన సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. 12వ తేదీన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఒఎన్‌జిసి సంఘాలు, యాజమాన్యంతో సమస్యలపై చర్చిస్తారని వివరించారు. స్వాగతం పలికిన వారిలో స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బొండ తౌడన్న, బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, ఎల్‌వి.రమణారావు, మోహన్‌బాబు, పుల్లారావు, కెవి.రత్నం తదితరులు పాల్గొన్నారు.



సుభాష్ రామ్‌నాథ్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి పెందుర్తి శాఖ గ్రంథాలయ ప్రాంగణంలో మెడికవర్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆర్గనైజర్ పి.నాయుడు నేతృత్వంలో డాక్టర్ తరుణ్, డాక్టర్ ధనుష్ వైద్య తనిఖీలు చేశారు. 150 మందికి బిపి, సుగర్, ఇసిజి పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఇటువంటి వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, దాడి రమణచిట్టి, పెందుర్తి పిఎసిఎస్ ఛైర్మన్ సరగడం నరసింహమూర్తి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వైస్ ప్రెసిడెంట్ పి.భూలోకరావు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, కోశాధికారి పెంటకోట గణేష్, సూరిశెట్టి గణేష్, శరగడం అప్పారావు, శరగడం రమణ, డి.దేవుడు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న వైద్యులు

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను హైకోర్టు జడ్జి రాజశేఖర్, సుబ్బారెడ్డి, దుర్గాప్రసాద్, జిల్లా జడ్జి గిరిధర్, జిల్లా సివిల్ కోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో సింగాల శ్రీనివాసమూర్తి స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఈవో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డైట్ వైస్ ప్రిన్సిపల్ జి.రవి మాట్లాడుతూ, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఓ వైపు ప్రయత్నాలు జరుగుతున్నా, ఏదో ఒక చోట మానవ హక్కుల అణచివేత జరుగుతూనే ఉందన్నారు. మానవ హక్కుల పట్ల యువత అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.హరిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తగరపువలస : రాష్ట్ర విపత్తు శాఖ సీనియర్ ఉపాధ్యక్షులు శీరపు రామలక్ష్మి ఆధ్వర్యాన స్థానిక జంక్షన్‌లో సుమారు 50 మంది పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ సుఖవంతంగా, స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ కమిటీ ఉపాధ్యక్షులు కె.కవిత, రాష్ట్ర విపత్తు శాఖ కార్యదర్శి ఎస్.ధరణి, వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ లీగల్ : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విశాఖ లైబ్రరీలో ఫోరం ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్ స్వచ్ఛంద సంస్థ "మానవ హక్కులు ప్రజాస్వామ్యం" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఫోరం ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్, ఫౌండర్, అధ్యక్షులు కుప్పిలి మురళీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ వి.రాజ్యలక్ష్మి, డాక్టర్ ఎల్‌వికె.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బగాది తులసీదాస్ సన్ మూర్తి, ఎన్‌వి.సుమన్, నిర్మల, శ్రీదేవి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : బివి ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థల ఆధ్వర్యాన డాక్టర్ ఎల్‌బి.కాలేజీలో మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధంలో అసువులు బాసిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, ఆచార్య పిడి.సత్యపాల్, విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, మానవ హక్కుల కార్యకర్త డాక్టర్ ప్రియాంక గంగారపు, డాక్టర్ పికె.జోష్, హరగోపాల్, హుస్సేన్, డాక్టర్ బాబ్జి, సత్యవతి, ప్రజ్ఞాన్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : పెదమడక రాజీవ్ కల్యాణ మండపంలో గ్లోబల్ వుమెన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ గ్రా చైర్మన్ కాసుల కొండయ్య హాజరై మాట్లాడారు. ప్రజలకు మానవ హక్కులపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, 85వ వార్డు కార్పొరేటర్ ఎల్లపు వరలక్ష్మి, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, విశాఖ జిల్లా గ్రా చైర్మన్ మోటూరు వెంకటరమణ, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షులు స్వామి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి పూర్ణానంద శర్మ, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్య నారాయణ పాల్గొన్నారు.



పెదమడకలో అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న ప్రతినిధులు

వేపగుంట : మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ (ఐహెచ్‌ఆర్‌సి) ఆధ్వర్యాన ఎన్ఎస్‌టిఎల్ దగ్గరలోని నిరాశ్రయ వసతి గృహంలో అల్పాహారం, జనరల్ మెడిసిన్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సమర్పణరాజు, ట్రెజరర్ ఆర్.విజయ, మధు, జయరాజు, పుసర్ల మురళి, వై.శ్రీనివాస్, వై.మమత తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: స్థానిక పరివర్తనా కార్యాలయంలో దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆధ్వర్యాన మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు దాసరి అన్నపూర్ణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు దువ్వాడ దావీదు, పాయకరావుపేట టౌన్ కన్వీనర్ చిరుకూరి రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు వరలక్ష్మి

అనకాపల్లి : చట్టాలెన్ని చేసినా వాటి అమలులో పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లే మహిళలపై నానాటికీ హింస పెరుగుతోందని, దాన్ని అరికట్టి ఆడబిడ్డలను రక్షించుకుందామని ఐద్వా జిల్లా నాయకురాలు డిడి వరలక్ష్మి అన్నారు. మానవ హక్కుల పక్షోత్సవాల్లో భాగంగా గతనెల 25 నుంచి ఈనెల 10వ తేదీ వరకు ఐద్వా ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎస్‌సి బాలికల వసతి గృహంలో విద్యార్థులకు ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రమణ, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు శివాజీ పాల్గొన్నారు.

వికలాంగులు ఆత్మన్యూనతా భావాన్ని వీడాలి

అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్



ల్యాప్‌టాప్ పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రతికూల పరిస్థితులు ఎదురైనా విభిన్న ప్రతిభావంతులు అధైర్య పడకూడదని, ఆత్మవిశ్వాసంతో, సానుకూల దక్పథంతో ముందడుగు వేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణరాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం గవరపాలెం గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఆత్మ నూన్యతాభావాన్ని దరిచేరనీయకూడదన్నారు. సమాజంలో మిగిలిన వారి కంటే వికలాంగులు దేనిలోనూ తక్కువ కాదని, వారికి వచ్చే ప్రతి అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. వికలాంగుల పట్ల సానుభూతి కన్నా వారిని ప్రోత్సహించాలన్నారు. అనకాపల్లి జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా నర్సీపట్నం, అచ్యుతాపురం ప్రాంతాలలో గ్రూపులుగా ఏర్పడి రుణాలకు దరఖాస్తు చేశారన్నారు. అంతకుముందు జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు డిఆర్ఓ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, వాటిని వినియోగించుకోవాలన్నారు. వికలాంగుల్లో పథకాల పట్ల అవగాహన కల్పించి, వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సాహిస్తున్న పిఎస్. తిరుపతి పట్నాయక్ కృషిని అభినందించారు. ఆర్.పి.డి. చట్టం సభ్యులు పి.ఎస్. తిరుపతి పట్నాయక్ మాట్లాడుతూ. సాంకేతిక కారణాలతో కొంతమందికి పింఛన్లు ఆగిపోయాయని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం వికలాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు అందచేశారు. బాలికల సాంస్కతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జగదీష్, ఆర్‌పిడి. సభ్యులు వీరు యాదవ్, రవి, అర్జునరావు, మదర్ థెరిసా సంస్థ ప్రతినిధులు కె.సన్యాసినాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన

350 మందికి ఉచిత కంటి పరీక్షలు



వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న దొరైస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం :బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 350 మంది కంటి రోగులను పరీక్షించారు. వీరిలో. 237 మందికి ఉచితంగా కంటి అద్దాలను, 109 మందికి మందులు పంపిణీ చేశారు. 40 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేయగా, ప్రత్యేకంగా బ్రాండిక్స్ బస్సులో వారిని కంటి ఆపరేషన్ కోసం విశాఖ శంకర్ ఫౌండేషన్ హాస్పటల్ కు తరలించారు.

వైద్య శిబిరానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు మజ్జిగ ఫలహారాలు భోజన సదుపాయం కల్పించారు.ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాట్లను బ్రాండిక్స్ ఇండియా పాట్నర్ దొరస్వామి పర్యవేక్షించారు. శిబిరానికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా బ్రాండిక్స్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగు పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని పి భీమవరం గ్రామంలో కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు వ్యవసాయ పనిపై రైతులకు అవగాహన కలిగించే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయంపై రైతులకు అర్థమయ్యేలా మ్యాప్ వేసి సూచనలు చేశారు.. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పినపోలు రాము నాయుడు, ఆర్‌బికె విఎఎ ఏ ఉమా పార్వతి, విద్యార్థులు చేతన, దివ్యశ్రీ, జ్ఞాన సాహితీ, నాగదీపిక పాల్గొన్నారు

వడ్డాది : మండలంలోని బంగారుమెట్ట గ్రామంలో నూతన వ్యవసాయ విధానాలు, ఉత్పత్తులపై రైతులకు శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్లఓని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. సూచించారు. వెన్ డయాగ్రామ్ (చపాతీ బొమ్మ) గురించి వివరించారు. విద్యార్థులు పి. లాస్యప్రియ, ఎ.మనీష, పి.కీర్తన, కె. అనూష, టి. కావ్య, కె. దుర్గా శ్రావణి స్థానిక నేతలు సాయం రమేష్ బత్తుల శ్రీను, సాయం శేషు, పాల్గొన్నారు

బిసిల రాజ్యాధికారానికి పోరాట రథయాత్ర



పోరాట రథయాత్రలో పాల్గొన్న బిసి నేతలు

ప్రజాశక్తి- సబ్బవరం : బిసిల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర చేపడుతున్నట్లు బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. సమసమాజ స్థాపన, సామాజిక న్యాయం కోసం ఈనెల 7 నుండి శ్రీకాకుళం నుండి తిరుపతి వరకు బిసిల రాజ్యాధికార పోరాట రథయాత్ర ఆదివారం సబ్బవరం చేరుకున్న సందర్భంగావారికి బిసిసంఘం రాష్ట్రఉపాధ్యక్షులు బర్ణికాన సాయి నాధారావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జోడుగుళ్ల నుండి చోడవరం రోడ్డు వరకు ర్యాలీగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా బీసీ నేతల రాతలు మారలేదని, సామాజిక అసమానతలు పెరుగుతున్నాయని, వీటిని నియంత్రించి, బిసిలు రాజ్యాధికారం సాధించాలంటే అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘంజాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల నర్సింగరావు, రాష్ట్ర మహిళ అధ్యక్షరాలు వై. నూకానమ్మ, బీసీ సంఘం నాయకులు కె.లక్ష్మణరావు, బంధం వెంకటరమణ, పల్లా తాతారావు, మండల అధ్యక్షులు వడిశల రమేష్, సబ్బవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసేన నేతకు పంచకర్ల పరామర్శ



ఆసుపత్రిలో జనసేన నేత సాయిని పరామర్శిస్తున్న పంచకర్ల

ప్రజాశక్తి -అనకాపల్లి : వైసిపి నాయకుడి వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన జనసేన నాయకుడు సాయిని ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు పరామర్శించారు. అనంతరం జనసేన జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, జనసేన నేతలు, కార్యకర్తలపై వైసిపి ప్రభుత్వం, నాయకుల వేధింపులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. జనసేన నేతలజోలికొస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పైలా అప్పలనాయుడుకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి - పరవాడ: మండల కేంద్రం పరవాడ గ్రామంలో రాష్ట్ర సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు తండ్రి పరవాడ మాజీ ఎమ్మెల్యే పైలా అప్పలనాయుడు(నాయుడుబాబు) 19వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పరవాడ సంతబయలు వద్ద అప్పలనాయుడు కాంస్య విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక పిహెచ్‌సిలో రోగులకు, పరవాడ గర్ల్స్ హాస్టల్‌లో విద్యార్థులకు బ్రెడ్‌లు, పండ్లు పైలా యువసేన సభ్యులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పరవాడ ఎంపిపి పైల వెంకట పద్మలక్ష్మీ, జెడ్‌పిటిసి పైలాసన్యాసిరాజు, జిల్లా ప్రధానకార్యదర్శి చుక్క రామునాయుడు, పరవాడ వైస్ ఎంపిపి బంధం నాగేష్, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జయరాం, ఎంఎస్ఎంఇ రాష్ట్ర డైరెక్టర్ నదియా, పరవాడ సర్పంచ్ శిరిపురపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, సర్పంచ్‌లు కే.సీతారామయ్య వరలక్ష్మి, గొర్లి గోపి అమ్ములు, పల్లా అప్పారావునాగమణి, పెదిసెట్టి పూజశేఖర్, బండారు కల్పన రాజశేఖర్, ఎంపిటిసిలు సప్పా ప్రభ సన్యాసిరావు, గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, గోళ్ళవిల్లి శ్రీను, బొడ్డపు చిన్నారావు, కంచిపాటిభాస్కర్, రెడ్డి శ్రీను, బండారు రామారావు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపిటిసిలు,పైలా

12న పెన్షనర్స్ డే పాటించాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

ప్రజాశక్తి- వడ్డాది : పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వం ఆదుకోవాలని ఆల్ ఫెన్సనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఈనెల 12న పెన్షనర్స్‌డేను జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో నిర్వహించిన సమావేశంలో నేతలుమాట్లాడుతూ, ప్రతినెలా పదో తేదీన పెన్షనర్ల సమావేశాన్ని జిల్లాలో ఒక చోట నిర్వహించనున్నామని, ఇందులో భాగంగా ఈనెల 10న వడ్డాదిలో నిర్వహించామన్నారు. ఐఆర్‌ఎఫ్ 95 పెన్షనర్లకు కనీస పెన్షన్‌ను రూ.రెండు వేలు నుంచి రూ. 9500కు పెంచాలని, పెంచిన డిఎ వర్తింపజేయాలని చేయాలని, మెడికల్ బెనిఫిట్స్‌తోపాటు కోవిడ్ సమయంలో రద్దుచేసిన రైల్వేఛార్జీల్లో రాయితీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లడే సందర్భంగా ఢిల్లీలో జరుగుతున్న ధర్నాకు హాజరు కావాలని కోరారు కార్యక్రమంలో పల్లెల జోగారావు, పెనుపాత్రని సాంబశివరావు, ఎస్.కొండబాబు ఎస్.లక్ష్మణరావు, టి.సత్యనారాయణ పాల్గొన్నారు

13న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- కశింకోట : అపరిష్కృత విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈనెల13న ఉదయం 10 గంటలకు అగనంపూడి సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎస్.రామకృష్ణ తెలిపారు. అగనంపూడి సబ్-డివిజిన్ పరిధిలోని అగనంపూడి, తాళ్లపాలెం విభాగం వినియోగదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్రాంత న్యాయమూర్తి , సిజిఆర్‌ఎఫ్ ఛైర్మెన్ .బి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో వినియోగదారులు ఎటువంటి విద్యుత్ సమస్యలనైనా వేదిక దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకునే వీలుంటుందన్నారు.

ఆత్మీయ విద్యార్థి సేన రక్తదాన శిబిరం



జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఆత్మీయ విద్యార్థి సేన ఆధ్వర్యంలో ఆదివారం 100 మంది పూర్వ విద్యార్థులులు రక్తదానం చేశారు. మామిడిపాలెం హైస్కూల్ లో ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదానశిబిరంలో ఆత్మీయ విద్యార్థి సేన గౌరవ అధ్యక్షులు కేవీనల్ ప్రసాద్, అధ్యక్షులు పల్లా రాజు, వైస్ ప్రెసిడెంట్ సింహాచలం, కార్యదర్శి గొల్లవిల్లి శ్రీను, ఉపకార్యదర్శి పిల్లా సురేష్, కోశాధికారి మొల్లి మురళి, వునుకూరి కష్ణ, ఆత్మీయ గురువులు అప్పలమూర్తి, కొండలరావు, రమేష్ మాస్టర్లు పాల్గున్నారు. కమిటీ సభ్యులు ముత్తురెడ్డి రమేష్, కోరువాడ వెంకటేష్, ఎన్నెంటి సత్యనారాయణ, బొట్టా అప్పలరాజు,మొల్లి లక్ష్మణ్, పల్లా కళ్యాణ్, ఓ వి ఎస్ కుమార్, పల్లా వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఉప్పవరంలో ఒకేరోజున దంపతుల మృతి

భర్త మృతి వార్త విని గుండె ఆగిన భార్య



మృతి చెందిన దంపతులు సత్యవతి, సత్యనారాయణ

ప్రజాశక్తి - అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరంలో ఉప్పవరం గ్రామంలో భార్యా భర్తలిద్దరూ ఒకేరోజున మృతిచెందిన హృదయ విదారక ఘటన చోటుచేసుకంది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శనివారం రాత్రి 7 గంటల సమయంలో భార్యభర్తలిద్దరూ ఒకేసమయంలో చనిపోయారు. గ్రామానికి చెందిన గంగిరెడ్డి సత్యనారాయణ (70) అనారోగ్యంతో మృతిచెందగా, తి భర్త మరణవార్త విన్న భార్య సత్యవతి వెంటనే గుండె ఆగి ప్రాణం విడిచింది. ఏడడుగుల బంధంతో ఒక్కటై ఇన్నాళ్లు కలిసిమెలిసి జీవించిన దంపతులిద్దరూ ు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడం పట్ల గ్రామస్తులు, కుటుంబ సభ్యులు విచారం వ్యక్తం చేశారు.

వైసిపిలో చేరికలు అవాస్తవం



మాట్లాడుతున్న టిడిపి జనసేన నాయకులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నుంచి 70 కుటుంబాలు వైసిపిలో చేరినట్లు వచ్చిన వార్తలన్నీ అవాస్తవాలని చౌడువాడ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చల్లపల్లి శ్రీనివాసరావు. జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు మాలపరెడ్డి శివ ఖండించారు. ఆదివారం విలేకర్లతో మాట్లాఉతూ, వైసిపిలో ప్రాధాన్యత దక్కని, నామినేటెడ్ పదవుల్లో చోటు రాని కొందరు నాయకులు కొంతకాలంగా ఆ పార్టీకి దూరంగా ఉన్నారని, వారిని పార్టీలో చేర్పించుకున్నారు. పటిష్టంగా ఉన్న టిడిపి, జనసేన కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయడానికే ఇలా కండువాలు వేసి పార్టీల్లో చేరికలంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. టిడిపి, జనసేన నుంచి ఎవరూ వేరే పార్టీవైపు చూడలేదని, కండువాలు కప్పుకున్నవారు వీరేనని నిరూపించగలరా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు, జనసేన నాయకులు కుంచ అంజిబాబు. కుమార అర్జునరావు. గేదెల శ్రీనివాసరావు, అమరపల్లి రామారావు, భీశెట్టి రామ్, రామకోటి వల్లంశెట్టి రాము పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం'



పున్తక పఠనంలో విద్యార్థులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : స్థానిక శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో జనరల్ నాలెడ్జి, కథల పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, దీనివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం

- నాడు నేడు నిధుల లేమితో నిలిచిన నిర్మాణం
- అవస్థలు పడుతున్న బంగారయ్యపేట విద్యార్థులు



మొండిగోడలతో బంగారయ్య పాఠశాల భవనం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాల భవనం నిధుల లేమితో నిలిచిపోయింది. నాడు నేడు పథకంలో రూ.12 లక్షలు మంజూరుకాగా, 2022 నవంబర్ నెల వరకు ప్రభుత్వం రూ.3 లక్షలు విడుదల చేసింది. తర్వాత నిధులు విడుదల లేకపోవడంతో నిర్మాణం నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో పిల్లర్లపై శ్లాబ్‌వేసి దిష్టిబొమ్మలా పాఠశాల భవనం నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 32 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పుటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేసి, అసంపూర్తి పాఠశాల భవనం పూర్తిచేసే చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి వద్ద నిధులు విడుదలలో జాప్యం జరిగినందున పనులు నిలిచిపోయాయన్నారు.

'పాలస్తీనా స్వేచ్ఛకు గళమెత్తుదాం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : కోడుగంటి గోవిందరావు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'పాలస్తీనా స్వేచ్ఛ కోసం గళ మెత్తుదాం' పుస్తకావిష్కణ ఆదివారం జరిగింది. అధ్యయన కేంద్రం కన్వీనర్ రాజాన దొరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కో కన్వీనర్ సన్యాసిరావు స్వాగతం పలకగా, ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ డి హెచ్ రాజబాబు, మళ్ళ మాధవరావు, వెంకటరమణ ,అర్ శంకరరావు, భద్రం, బాలు, చంద్రశేఖర్, చిన్ని యాదవ్, మాణిక్యాలరావు, అప్పారావు, శివరాం మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం చాలా దారుణమైన సంఘటనగా అభిప్రాయపడ్డారు. అమెరికా తన యుద్ధసామగ్రి అమ్మకాల కోసం ప్రపంచంలో పొరుగు దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. పాలస్తీనాతో స్నేహబంధం ఉన్నప్పటికీ, మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలవడం బాధాకరమనానరు..యుద్ధం వద్దు - శాంతి ముద్దు అని ప్రపంచం శాంతి కోరుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ముందుగా సమావేశం యుద్ధంలో మరణించిన వారికి మౌనం పాటించినది.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని కొత్తపల్లి సచివాలయం వద్ద ఆదివారం వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా 17 కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఎంపిడిఒ రవికుమార్ అవగాహన కల్పించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కలగ గున్నియ్య నాయుడు, కరణం శ్యాంసన్, కొన నాయుడు, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అప్పారావు, ఎపిఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల, హరిపాలెం గ్రామాలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. కొండకర్ల గ్రామంలో కేంద్ర సంక్షేమ పథకాలపై ఫోటోల ప్రదర్శన ఏర్పాటు చేశారు. 2024 సంవత్సరపు ప్రభుత్వ క్యాలెండరును ఆవిష్కరించారు.

మండల పరిషత్ పరిపాలన అధికారి డి.కృష్ణ , ఇఒపిఆర్‌డి నాయుడు, ఎఒ శంకర్ గోవింద, ప్రజా ప్రతినిధులు కోటి శివ, ఎం సూర్యనారాయణ, రాజాన సన్యాసినాయుడు, అగాల హనుమంతరావు, గొంతిన భక్త సాయిరాం, గుడివాడ రమణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పెంచండి

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంచాలని ఫోరం ఫర్ బెటర్ సభ్యులు డిఎస్ ప్రసాద్, గోవిందరావు కోరారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ బి తిరుమల బాబుకు వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. నియోజకవర్గంలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 1400 ఓట్లు వరకు వున్నాయని, దీని వల్ల ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లు ఇబ్బందులు పడడమే కాకుండా గంటల తరబడి వేచియుండే పరిస్థితి ఉంటున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రెండు ఓట్లు వేయడానికి మరింత ఎక్కువ సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్ల ప్రయోజనం, ఓటింగ్ సమయం తగ్గించడం, ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకునేందకు వీలుగుఆ పోలింగ్ కేంద్రాలను పెంచాలని కోరారు.

ఆర్మీ జవానుకు ఘన సత్కారం



తమ్మునాయుడును సత్కరిస్తున్న పూర్వ మిత్రులు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని రావలమ్మపాలెం జెడ్‌పి హైస్కూల్‌లో 1998-99 బ్యాచ్ పూర్వవిద్యార్థి, భారత ఆర్మీలో సేవలందించి, ఇటీవల ఉద్యోగవిరమణ చేసిన ఆర్మీ జవాన్ కోటాన తమ్మునాయుడును అదే బ్యాచ్‌కు చెందిన పూర విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ్ము నాయుడు భారత సైన్యంలో దేశానికి ఎనలేని సేవలు అందించారని,శేష జీవితం ఆనందంగా వుండాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో సబ్బవరపు రామకృష్ణ, నరసింహ మూర్తి, శీరంరెడ్డి రామకృష్ణ, బైలపూడి రమణ, గొర్లి ప్రసాద్, గొంప రమణమూర్తి పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- దేవరాపల్లి : కార్తీక మాసం పర్వదినాలను పురస్కరించుకొని మండలంలోని ఏ. కొత్తపల్లి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వడ్డాది : బంగారమెట్ట కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. చోడవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధనకు ఎల్‌బిపి అగ్రహారం, పోతనపూడి, బంగారు మెట్ట లోపూడి, ఎల్. సింగవరం గ్రామాలకు చెందిన1500 మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి బంగారు మెట్ట అధ్యక్షులు సాయం శేషు, దొండ వెంకటరమణ, దొండ రాజా, బత్తుల శ్రీను, సరగడం జగన్నాథరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్ర ఈనెల 11న అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రవేశిస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు తెలిపారు. పాయకరావుపేట నుండి యలమంచిలి, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గం పరవాడ మీదగా గాజువాకకు యువగళం పాదయాత్ర చేరుకుంటుందని, దీన్ని జయప్రదంచేయాలని కోరారు. పాదయాత్రలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చన్న నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, వంగలపూడిఅనిత, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, గంటా శ్రీనివాసరావు, వెలగంపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, బత్తుల తాతయ్య బాబు పివిజి కుమార్ ప్రగడ నాగేశ్వరరావు పీలా గోవింద సత్యనారాయణ, కెఎస్ఎన్ రాజు గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావుతో పాటు ముఖ్యనేతలంతా పాల్గొంటారన్నారు. 20న నెల్లిమర్ల నియోజకవర్గం పోలిపల్లిలో నిర్వహించే బహిరంగ సభలో టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ పాల్గొంటారన్నారు. టిడిపి, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, ప్రజలు, తెలుగుమహిళలు యువత పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నాగజగదీష్ పిలుపునిచ్చారు.

అచ్యుతాపురం : తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఆదివారం అచ్యుతాపురంలో పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కేడర్‌కు తగు సూచనలు చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పప్పుల చలపతిరావు రాష్ట్ర కార్యదర్శి రాజన్న రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి పీలా తులసి రాము , మామిడి శివ అప్పారావు , దేశం శెట్టి ఎల్లయ్య నాయుడు కూని శెట్టి రమణ,కాండ్రేగుల సూర్యనారాయణ, పి చెన్నయ్య నాయుడు, మెరుగు వెంకటరావు, లాలము నాగేశ్వరరావు పాల్గొన్నారు

రోడ్డు వేశారు.. కల్వర్టు మరిచారు...

- అవస్థలు పడుతున్న అల్లుముయ్యపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో రామచంద్రపురం గ్రామ శివారు గిరిజనుల గ్రామమైన అల్లుముయ్యపాలెం గ్రామానికి సంబంధించి సుమారు 3 కోట్ల 30 లక్షల ఉపాధి హామీ నిధులతో సుమారు 5 కిలోమీటర్లు నిర్మిస్తున్న రోడ్డు పనులు గ్రామం వరకు వేసి కల్వర్టు నిర్మించక పోవడం పట్ల గ్రామస్తులతో పాటు మండల వ్యాప్తంగా పలు సంఘాల నాయకులు పలు విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామంలో ప్రధానంగా నిర్మించాల్సిన కల్వర్టు నిర్మాణం చేపట్టక పోవడంతో కొండవాలు గెడ్డను గిరిజనులు దాటి వెళ్ళవలసి వస్తుంది. అటవీ ఉత్పత్తులు, ఫలసాయం తీసుకు వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా పాఠశాలకు వెళ్లే దారి కూడా అదే కావడంతో కల్వర్టు లేక గెడ్డ దాటాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా గ్రామంలో మరికొన్ని చోట్ల కల్వర్టులు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నిర్మాణాలు నిలిపి వేయడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. సదరు గ్రామానికి వెళ్లే దారిలో భూ బకాసురులు అధికంగా ఉండటం, భూముల విలువ రేట్లు పెంచుకునేందుకే మాత్రమే రోడ్డు వేశారని పలువురు ఆరోపించారు.

గ్రామంలో కల్వర్టుల నిర్మాణాలు నిలిపివేయడంతో రోడ్డు నిర్మాణం రియల్ టర్ల కోసమే వేసినట్లు ఉందంటూ చర్చించు కుంటున్నారు. రోడ్డు నిర్మాణానికి ముందు ఈ ప్రాంతంలో ఎకరా భూమి విలువ 5లక్షల నుంచి 10లక్షల వరకు ఉండేది. ప్రస్తుతం రహదారి నిర్మాణంతో అమాంతంగా 40 లక్షల వరకు చేరుకుంది. ఇక్కడ నివసించే గిరిజనులు కేవలం పోడు భూముల పైనే ఆధారపడి జీవిస్తూ ఉంటారు. వాస్తవానికి రోడ్డు సమీపంలో భూములన్ని బకాసురుల చేతుల్లోనే ఉన్నాయి. కేవలం భూమిని రియల్ ఎస్టేట్ గా మార్చే అమ్ముకోవడానికి రోడ్డు నిర్మాణం చేపట్టారని అధికార ప్రతిపక్ష పార్టీ నాయకులు సైతం బహిరంగంగా చర్చించు కుంటున్నారు. రహదారి సమీపంలో విలువైన ప్రభుత్వ భూములు కూడా అన్యాక్రాంత మయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గిరి పుత్రులు కోరుకుంటున్నారు.



గ్రామం వరకూ వేసిన రోడ్డు



కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం

విరిగిపడుతున్న కొండచరియలు

- పట్టించుకోని అధికారులు, నాయకులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో వరాహ నదీ పరివాహక ప్రాంతమైన ఇందేశమ్మ వాక పందూరు ఘాట్ రోడ్లపై కొండచరియలు విరిగి పడుతున్నా అధికారులు పట్టించుకోలేదు. కొండచరియలు విరిగి పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.స్వతంత్రం సిద్ధించిన తొలి నాళ్లల్లో నిర్మించిన ఈ రహదారి నేటికీ విస్తరణకు నోచుకోలేదు. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు కొన్ని చోట్ల కుంగి పోవడంతో ట్రాఫిక్ సమస్య కూడా ఎదురవుతోంది. ఎన్నికల సమయంలో నాయకులు వాగ్దానాలు గుప్పిస్తున్నారే కానీ తదుపరి ఎవరు పట్టించుకోలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల కొండ చరియలు విరిగిపడి రాళ్ల దొల్లు కొస్తున్నాయి. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



విరిగి పడిన కొండ చరియ



చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక శాఖా గ్రంధాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంధాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలో పెద్ద గుమ్ములూరులో ప్రజా వైద్యశాల వద్దకు వచ్చిన రోగులకు వైద్యులు బంగారయ్య ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఆదివారం అయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, నిరుపేదలు ఎవరూ కూడా ఆనారోగ్యంతో బాధపడకుడదనే ఉద్దేశంతో ఈ వైద్యశాల ప్రారంభించామన్నారు. మందులు వేసుకున్నా తగ్గని వారిని తదుపరి వైద్యంకు విశాఖపట్నం వస్తే వైద్య సహాయం అందిస్తానన్నారు. ప్రతీ ఆదివారం ఇక్కడ వైద్య శిబిరంతో పాటు నియోజకవర్గంలో పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నానన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఎక్స్ రేను పరిశీలిస్తున్న వైద్యులు బంగారయ్య

వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను ప్రతినెలా సకాలంలో వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సుజాత సాల్మాన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక పోవడంతో బ్యాంకు రుణాలు, బయట ఫైనాన్స్‌తో రుణాలు, వాహనాలు తీసుకున్న ఉద్యోగస్తులు నెలవారీగా చెల్లించే ఈఎంఐలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ట్రాఫిక్‌తో సతమతం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రధాన రహదారిని అనుకుని పలు దుకాణ సముదాయాల వద్ద ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో, పాదచారులు, వాహనదారుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నా పంచాయతీ, పోలీస్ అధికారులు పట్టించుకోలేదని పలువురు వాహనదారులు ఆరోపించారు. దీనికి తోడు అక్రమంగా ఏర్పాటు చేసిన పలు దుకాణాల వద్ద మరింత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-నక్కపల్లి: 1976-77 లో నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మండలంలోని ఉపమాక వెంకన్న సన్నిధిలో ఆదివారం కలుసుకున్నారు.ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణంలో గడిపి సందడి చేసారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎన్‌విఆర్ గోపాలచార్యులు, డివి రామారావు, నరిశే వెంకటాద్రి, నూకయ్య శెట్టి, ఎం రమణ, అబ్దుల్ అజీమ్, సత్యనారాయణ మదీనావల్లి, రాధిక తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న సైనిక్ దళ్ టైమ్ అధ్యక్షులు ప్రకాష్

తుపాన్ బాధితులకు సహాయం

ప్రజాశక్తి-యస్.రాయవరం: ఇటీవల తుఫాన్ కి మండలంలో దార్లపూడి గ్రామంలో నివసిస్తున్న బంగారు నూకరాజు ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో సహాయం అందించినట్టు సమతా సైనిక్ దళ్ టైమ్ అధ్యక్షులు గారా ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ, దార్లపూడి శివారు ప్రాంతంలో నివశిస్తున్న బంగారు నూకరాజు కుటుంబాన్ని ఆదివారం జడ్పిటిసి కాకర్ల దేవి కలిసి మనోధైర్యం చెప్పి కుటుంబానికి బియ్యం, కూరగాయలు, కొంత నగదు సహాయం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బిక్కవోలు విజయ్, అప్పారావు, ఎంపీటీసీ బైపా శ్రీను, రాజు, మోహన్ పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయరూ..

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని కొండల అగ్రహారం గ్రామంలోని ప్రధాన రహదారి వద్ద రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఈ రోడ్డు గతుకులు పడి ఉండటంతో వాహన దారులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై కల్వర్టు ఊసలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



గొయ్యి పడిన రోడ్డు



వరిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిత

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:తుఫాన్ ప్రభావంతో నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. మండలంలోని జి.జగన్నాధపురం లో తుఫాను ప్రభావంతో ముంపునకు గురై దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. పంట చేతికందే సమయంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి వరి పంట పూర్తిగా దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయామని పలువురు రైతులు అనిత ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టాలు వింటుంటే చాలా బాధనిపిస్తుందని, ఇలాంటి సమయంలో అండగా ఉండాల్సిన ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులకు కొప్పిశెట్టి బుజ్జి, నానేపల్లి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఉద్దండ పురం జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను కారు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు గాయపడ్డారు .స్థానిక సిహెచ్‌సిలో ప్రధమ చికిత్సను అందించారు.

ఇదిలా ఉండగా ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నంకు చెందిన నాని, ఏ.నాని కే.నాని ముగ్గురు కలిసి బైక్ పై తుని వెళుతూ చినరాంభద్రపురం హైవే జంక్షన్ వద్ద ఆగివున్న బైక్‌ను ఢీకొన్నారు .ఈ ప్రమాదంలో నలుగురు గాయపడడంతో హైవే పోలీసులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.



నగదును అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితునికి రూ.80 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కొత్తకోట:ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నిరుపేద విద్యా వేత్త పడమటి శ్రీనివాసరావు కుటుంబానికి కొత్తకోటకు చెందిన కొత్తకోట ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు (కెఈఏ) సుమారు రూ.80 వేల ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనువాసరావు గత మూడు నెలల కిందట గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయ పడ్డారు. అతని కుటుంబం నిరు పేద కుటుంబం కావడం తో పాటు తండ్రి వృద్ధుడు, తల్లి అనారోగ్యం తో మృతి చెందటం పలు సమస్యలతో ఉన్నాడు దీనిపై స్పందించిన పలువురు దాతలు ఆర్థికంగా ఆదుకున్నారు. ఈ నేపథ్యంలో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సుమారు రూ.80 వేల ఆర్థిక చేశారు. ఈ అసోసియేషన్ సభ్యుల సూచన మేరకు మరో దాత రూ.40 వేలు, మరొకరు రూ. 16,500 కూడా త్వరలోనే అందించే ఏర్పాటు చేస్తామని సభ్యులు వీరప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా బాదితుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, తాను కష్టంలో ఉన్నానని గుర్తించి సహాయం అందించిన విద్యార్థులు, యువకులు, స్నేహితులు, మిత్రులకు, పిల్లలు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిహారం.. సందేహమే..

-తుపానుకు తీవ్రంగా నష్టపోయిన రైతులు

-కంటితుడుపుగా నేతలు, అధికారుల పర్యటనలు

-తూతూ మంత్రంగా దెబ్బతిన్న పంటల నమోదు



వడ్డాదిలో దెబ్బతిన్న పంట

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: తుఫానుకు తీవ్రంగా నష్టపోయిన వరి రైతును ఆదుకోవడంలో ప్రభుత్వం ప్రకటనలకే, ప్రచారానికే పరిమితమైతుంది తప్ప ఆదుకునే ఉద్దేశం లేనట్లు రైతులు వాపోతున్నారు. నేటికీ తుఫానుల దాటికి ఐదు రోజులు పైగా అయింది. బుచ్చయ్యపేట మండలంలో వడ్డాది, కుమందానిపేట, మంగళాపురం, బంగారుమెట్ట, చిన్నప్పన్నపాలెం, పోలేపల్లి తదితర వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. నాలుగైదు రోజులు నీటిలో వరి ఎన్నులు నుండి మొలకలు మొలుస్తున్నాయి. కానీ, వ్యవసాయ శాఖ అధికారులు, నేతలు పర్యటనలు, పరిశీలనలు కంటి తుడుపుగానే ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో నష్టపోయిన రైతులు వివరాలను నేటికీ సేకరించలేదు. దీంతో, పరిహారం అందుతుందా అన్న సందేహాలను పలువురు రైతులు వ్యక్తం చేస్తున్నారు. చిన్నప్పన్నపాలెం గ్రామంలో వర్షానికి ముందు పండిన వరి పంటను పలువురు రైతులు కోతల కోసి వరి పంటను పొలాల్లోనే విడిచి పెట్టారు. కుప్పలు పెట్టుకునే సమయం



నేల కొరిగిన వరి


సమయానికి వర్షం అధికంగా రావడంతో వరి పంటను పొలాల్లోనే విడిచి పెట్టారు. వర్షపు నీరు పొలాలపై నుండి ప్రవహించింది. అలాగే అనేక మంది తుఫాను ప్రభావానికి తీవ్రంగా నష్ట పోయారు. నష్టపోయిన రైతన్నను ఆదుకోవడానికి వారం రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యమని విమర్శిస్తున్నారు.

విదేశాలు, కాకినాడలో తిరస్కరించిన

బల్క్ డ్రగ్ పార్కు నక్కపల్లిలో ఏర్పాటు తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేసి డంపింగ్ యార్డ్ గా మార్చొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు ఎం.అప్పలరాజు తెలిపారు. మండలంలోని రాజయ్యపేటలో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. బల్క్ డ్రగ్ యూనిట్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్ డ్రగ్స్ పార్కును రాష్ట్ర ప్రభుత్వం నక్కపల్లిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడం, దానిని కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆమోదించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న హెటిరో డ్రగ్స్ కంపెనీతో నక్కపల్లి ప్రాంతం ప్రజలంతా వాయు, జల కాలుష్యంతో ఇబ్బందులు పడుతూ అనేక రకాల వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మత్స్యకారులు వేట సాగక ఉపాధి కోల్పోయి వలసలు పోతున్నారన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా పరిశ్రమలు, అభివృద్ధి పేరుతో విదేశాల్లో నిషేధించిన, కాకినాడ జిల్లా ప్రజలు తిరస్కరించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి ప్రాంతంలో నెలకొల్పి ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్ గా మార్చి ఇక్కడ ప్రజలు నివసించకుండా చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నక్కపల్లి లో బల్క్ డ్రగ్ యూనిట్ నెలకొల్పే ప్రతిపాదనలను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. కాలుష్యానికి నష్టం లేకుండా, స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించే పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రభుత్వం పూను కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు బి.రాము, కె.కాశీ, ఎం.నానాజీ, ఎం.జాన్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

రోడ్డుపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-రోలుగుంట:రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద గుంతలమయంగా మారిన రోడ్డును పోలీసులు పూడ్పి వేయించారు. కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో రోలుగుంట ఎస్సై సురేష్ తన సిబ్బందితో కలిసి ఈ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్పించారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు.



గోతులు పూడ్చి వేయిస్తున్న పోలీసులు

చాపరాయిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. పర్యాటకుల తాకిడితో చాపరాయి జలపాతంలో పర్యాటకుల ఆటపాటలతో సందడి వాతావరణం నెలకొంది. జలపాతంలో జారుతూ స్థానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. అంజోడా సిల్క్ ఫారం, కోల్లపుట్టు జలతరంగిని పర్యాటక ప్రదేశాల్లో కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పర్యాటకుల తాకిడితో సందడి వాతావరణం నెలకొంది.



జలపాతం వద్ద పర్యాటకులు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-రోలుగుంట: విశాఖలో వైద్య సేవలు అందిస్తున్న రోలుగుంట మండలం జేపి.అగ్రహారం గ్రామానికి చెందిన చిటికెల నూకన్నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. సుమారు 12 మంది వైద్యులు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అన్ని రకాల వైద్య సేవలు అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటపద్మ, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.